క్లుప్తంగా

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న కోరమాండల్ మహిళా క్లబ్ సభ్యులు

కాకినాడ రూరల్: వాకలపూడి ఫిషింగ్ హార్బర్‌పేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, పరీక్ష అట్టలను కోరమాండల్ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ కార్యదర్శి మల్లీశ్వరి మాట్లాడుతూ తమ క్లబ్ అధ్యక్షురాలు వెంకట దుర్గావతి సూచనల మేరకు పేద విద్యార్థులను చదువుకు ప్రోత్సహించేందుకు పుస్తకాలు, ఇతర సామగ్రి పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి శ్రీదేవి, సభ్యులు మాధవి, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో పశువులకు పరీక్షలు

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం కొవ్వూరులో జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. జనసేన మండల అధ్యక్షుడు కర్రెడ్ల గోవిందరాజులు ప్రారంభించిన ఈ శిబిరంలో ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స నిర్వహించిన 214 పశువులకు గాళ్ల టీకాలు, 36 పశువులకు వివిధ రకాలైన గర్భకోశ వ్యాధి చికిత్సలు చేశారు. ఏఎస్‌డీపీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.దినకర్, పండూరు, తిమ్మాపురం పశు వైద్యులు డాక్టర్ రాజ్యలక్ష్మి, టీవీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ స్వప్న బాధ్యతల స్వీకరణ



కాకినాడ రూరల్: మండల పరిషత్ అభివృద్ధి అధికారి కర్రే స్వప్న మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సర్పవరం జంక్షన్ వద్ద మండల పరిషత్ కార్యాలయంలో ఆమె బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా బదిలీపై వెళ్లి తిరిగి కాకినాడ రూరల్ మండలానికి వచ్చారు. ఇప్పటి వరకు ఎంపీడీఓగా పనిచేసిన రమేష్ నాయుడు రిలీవ్ అయ్యారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

కరప: తనను గెలిపించిన ప్రజలకు మేలు చేసేలా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. మండలం నడకుదురులోని ఓ ఫంక్షన్‌హాలులో మంగళవారం టీడీపీ సీనియర్ నాయకురాలు ఏటుకూరి నాగమణి ఆధ్వర్యంలో ఆయనతో పాటు, టీడీపీ కో ఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్‌లను సన్మానించారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అధినేత పవన్ కల్యాణ్ మన్ననలు పొందుతానని ఆయన అన్నారు. కార్యక్రమంలో శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

చిట్నీడికి లయన్స్ ఆఫ్ డిస్ట్రిక్ట్ అవార్డు



చిట్నీడిని అభినందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: లయన్స్‌క్లబ్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే లయన్స్ ఆఫ్ డిస్ట్రిక్ట్ అవార్డును లయన్స్‌క్లబ్ ద్వితీయ ఉప గవర్నర్ చిట్నీడి శ్రీనివాస్ కైవసం చేసుకొన్నారు. క్లబ్ జిల్లా గవర్నర్ వేలూరి సూర్యనారాయణ చేతుల మీదుగా మంగళవారం ఈ అవార్డు అందుకున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అనేక సేవా కార్యక్రమాలు అందించినందుకు ఈ అవార్డు అందించారు. లయన్స్‌క్లబ్ లీడర్‌షిప్ కో ఆర్డినేటర్ ముంజులూరి విశ్వేశ్వరావు, మాజీ గవర్నర్ బాదం బాలకృష్ణ, జిల్లా ఎలెక్టర్ గవర్నర్ ఈశ్వర్‌కుమార్ తదితరులు ఆయనను అభినందించారు.

ఒకేషనల్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

సామర్లకోట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యూ (మహిళ) ఒకేషనల్ కోర్సు బోధించడానికి గెస్టు ఫ్యాకల్టీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీదేవి మంగళవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ, నర్సింగ్ అర్హత కలిగిన వారు దరఖాస్తు చేయాలన్నారు. ఈనెల 21 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు సర్టిఫికెట్లతో నేరుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు హాజరు కావాలన్నారు. 22వ తేదీ ఉదయం 11 గంటలకు డెమో, ఇంటర్వ్యూ నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఖర్చు లేని వ్యాపారం

ఎవరికీ దరఖాస్తు చేయక్కర్లేదు.. ఏ చలానాలు కట్టక్కర్లేదు.. పన్నుల బాధ లేదు.. ఎవరికీ అద్దె చెల్లించక్కర్లేదు.. సరుకు తెచ్చుకుని లాభం వేసుకుని అమ్మేసుకుంటే చాలు.. ఏ పోలీసైనా కర్ర పెత్తనం చెలాయించాలని చూస్తే ఆ చేతికి ఎంతో కొంత ముట్టచెబితే చాలు.. ఆ రోజు గడిచిపోతుంది. పైగా ఆ దుకాణం ముందు ఎవరైనా ఎక్కువసేపు నిలబడినా.. ఏదైనా వాహనం పెట్టినా తీయండని గొడవకు దిగడం.. ఆ దుకాణాల వాళ్లంతా ఏకమైపోవడం.. ఇదంతా ఎవరిగురించో కాదండీ బాబూ.. ఫుట్‌పాత్ వ్యాపారుల గురించే.. వారి దందా మామూలుది కాదు.. నగరాభివృద్ధి తమకోసమే అన్నట్టు.. ఆక్రమణ తమ జన్మహక్కు అన్నట్టుంది వారి వ్యవహారం. అధికారుల ఉదాసీనత.. నిర్లక్ష్యం తప్ప ఏమీ కనపడదు.. పాదచారులు సైతం సద్దుకుపోవడం తప్పితే పనులు ఆపుకొని అనవసర పంచాయతీల్లోకి వెళ్లలేరు కదా.. చూద్దాం .. అధికారులు ఎప్పటికి స్పందిస్తారో..



ఫుట్‌పాత్‌పై సాగుతున్న వ్యాపారం

- ఫుట్‌పాత్‌లే అడ్డాగా స్థావరాలు
- ఖాళీ దొరికితే చాలు టెంట్ వేసేస్తారు
- రోజుకు నగటున రూ.పది వేల లావాదేవీలు
- వారిని తప్పించుకు వెళ్తున్న పాదచారులు
- ఉదాసీనంగా వ్యవహరిస్తున్న అధికారులు

బాలాజీచెరువు: లక్షలు వెచ్చించి టైల్స్‌తో ఆధునీకరిస్తున్న ఫుట్‌పాత్‌లను వ్యాపార కేంద్రాలుగా మారుస్తూ కొందరు వ్యాపారులు ప్రజలకు ఇబ్బంది కలగజేస్తున్నారు. రహదారుల విస్తరణలో భాగంగా పదేళ్ల కిందట సర్పవరం జంక్షన్ నుంచి భానుగుడి వరకూ రోడ్డుకు ఇరువైపులా ఆటు, ఇటు ఆరు అడుగులు ఖాళీ చేయించి ఫుట్‌పాత్‌లు ఏర్పాటుతో పాటు వాటిపై టైల్స్, లైట్లు వేసి సుందరంగా తీర్చిదిద్దారు. వాహన చోదకులకు ఇబ్బంది లేకుండా పాదచారులు ప్రమాదాల బారిన పడకుండా లక్షలు వెచ్చించి వీటిని అధికారులు తీర్చిదిద్దారు. ఇంత సుందరంగా తయారుచేసిన వీటిపై లక్ష్యానికి విరుద్ధంగా వ్యాపారులు ఆక్రమించుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారు. వారి తప్పించుకుంటూ పాదచారులు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. రోడ్ల విస్తరణలో భాగంగా ప్రధాన రహదారిలో నాగమల్లితోట జంక్షన్, ఐటీఐ వంటి ప్రాంతాల్లో ఉన్న బస్‌షెల్టర్లు తొలగించారు. దీంతో ప్రయాణికులు నిలబడటానికి నీడలేని పరిస్థితి ఏర్పడింది. సిటీ బస్సులు, ఆర్టీసీ బస్సులు అధికంగా ఉండే సమయంలో కొన్ని ప్రాంతాల్లో కొంతమంది దాతలు బస్‌షెల్టర్లు ఏర్పాటు చేసి తమ దాతృత్వాన్ని చాటుకునేవారు. క్రమక్రమంగా ఆటోలు రావడంతో ప్రయాణికులకు కావలసిన చోటల్లా అవి ఆగడంతో కేవలం ఆర్టీసీ బస్సు కోసం మాత్రమే వేచి ఉండేవారికి బస్‌షెల్టర్లు ఉపయోగపడేవి. క్రమేణా ఇప్పుడు వాటిని తొలగించడంతో ఉన్న నీడ కాస్తా పోయింది. ప్రధాన రహదారి పరిస్థితి ఇలా ఉంటే బాలాజీచెరువు, భానుగుడి పద్మప్రియ కాంప్లెక్స్, ఇంద్రపాలెం బ్రిడ్జి, రామారావుపేట, భానుగుడి దుర్గమ్మ గుడి, కోకిల సెంటర్ వంటి ప్రాంతాల్లో కేవలం ప్రధాన రహదారి తప్ప ఫుట్‌పాత్ అనేది కనబడదు. ఉన్న ప్రాంతాన్ని కాస్తా షాపులలో కలిపేసుకుని వ్యాపారాలు చేస్తుంటారు. విద్యాసంస్థలు పనిచేసే వేళల్లో ఐటీఐ, జేఎన్‌టీయూకే విద్యార్థుల అవస్థలు చెప్పనక్కర్లుద్దు. ఈ ప్రాంతంలో బస్సులు నిలపకపోవడంతో వారు దాదాపు కిలోమీటరు వరకూ నడిచి భానుగుడి వద్ద బస్సు ఏక్కాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కార్పొరేషన్ అధికారులు లేదా ట్రాఫిక్ పోలీసులు స్పందించి ఫుట్‌పాత్‌ల అక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఐటీఐ, జేఎన్‌టీయూకే విద్యార్థులకు అడ్డంగా ఉన్న ఫుట్‌పాత్ వ్యాపారం

వ్యాపారాల కోసం విస్తరించినట్లుంది



లక్షలు వెచ్చించి రహదారుల విస్తరణతో పాటు ఫుట్‌పాత్‌లపై టైల్స్, లైటింగ్ వంటివి ఏర్పరచి వ్యాపారస్తులకు చాలా సౌకర్యంగా ఏర్పాటు చేసినట్టుగా ఉంది. వీటిపై అధికారులు స్పందించి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలి.

– పి.రవితేజ.కాకినాడ

లైంగిక వ్యాధులపై అవగాహన కోసం రెడ్ రన్



రెడ్ రన్ మారథాన్‌ను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్

కాకినాడ క్రైం: లైంగిక వ్యాధులపై అవగాహన కోసం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మారథాన్ 5కె రెడ్ రన్ నిర్వహించారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ వద్ద డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ ఈ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. అక్షర స్కూల్ జంక్షన్ వరకు కొనసాగిన ఈ రెడ్ రన్‌లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌తో పాటు ఇతర లైంగిక సంక్రమణ వ్యాధులు, పునరుత్పత్తి భాగాల వ్యాధులపై అవగాహన కోసం మారథాన్ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. అనంతరం ఇవే అంశాలపై కొద్ది రోజుల క్రితం కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించిన క్విజ్ పోటీల విజేతలకు అవార్డులు, రివార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నివారణాధికారి ఆర్.రమేష్ సహా జిల్లా స్పోర్ట్స్ అధికారి శ్రీనివాస్ ఉమామనోవికాస కేంద్రం, షేర్ ఇండియా ప్రాజెక్టు, చేంజెస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

వసతి, సంరక్షణ గృహాల తనిఖీ



నగరంలోని ఓ హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న కమిషనర్ భావన

- అనకాపల్లి జిల్లా ఘటనపై స్పందించిన కలెక్టర్
- ఆయన ఆదేశాలతో వసతిగృహాలను పరిశీలించిన కమిషనర్, ఐసీడీఎస్ పీడీ తదితర అధికారులు
- విద్యార్థులకు అందుతున్న సేవలపై ఆరా

కాకినాడ సిటీ: నగరంలోని పలు వసతి, సంరక్షణ గృహాలను మంగళవారం రాత్రి నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహాల్లో ఆశ్రయం పొందుతున్న విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణ పరిస్థితులు కల్పించాలన్నారు. ఇటీవల అనకాపల్లి జిల్లా కోటవురట్లలోని ఓ వసతి గృహంలో ఫుడ్ పాయిజన్ జరిగి చిన్నారులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదేశాల మేరకు తహసీల్దార్, పోలీసు, శిశు సంక్షేమశాఖ అధికారులు కాకినాడ జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పిల్లల సంరక్షణ గృహాలు, వసతి గృహాలు, ఆశ్రమాల్లో పరిస్థితులపై తనిఖీ చేస్తున్నారు. దీనిలో భాగంగా కమిషనర్ భావన, ఐసీడీఎస్ పీడీ ప్రవీణ తదితరులు నగరంలోని పలు వసతి గృహాలను తనిఖీ చేశారు. అక్కడి విద్యార్థుల సంఖ్య, వారికి సరైన వసతులు ఉన్నాయా?లేదా? వారు తినే ఆహారం ఎలా ఉంటోంది? ఆరోగ్యకరమైన వాతావరణం ఉందా? వంటి విషయాలను స్వయంగా పరిశీలించారు. భోజనం బాగుంటుందా? అంటూ చిన్నారులను అడిగి తెలుసుకున్నారు. ముందుగా కమిషనర్ కలెక్టరేట్ వెనుక ఉన్న ఓ వసతి గృహాన్ని పరిశీలించారు. అక్కడ విద్యార్థులను పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీబీఎం కాలేజీ రోడ్డులోని కల్వారి సందేశ్ వసతి గృహాన్ని, భాస్కర్ నగర్ వాటర్ ట్యాంక్ సమీపంలో ఉన్న పరివర్తన వసతి గృహాన్ని సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలిచ్చారు.

అభివృద్ధిని వదిలి తప్పుడు కేసులా?

- చట్టబద్ధంగా అన్నింటినీ ఎదుర్కొంటా...
- ఆరు నెలల వరకూ వేచి చూస్తాం
- వనమాడికి ద్వారంపూడి బహిరంగ లేఖ



ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో గెలిపించిన ప్రజల విశ్వాసాన్ని చూరగొనేలా అభివృద్ధిపై దృష్టిపెట్టాల్సింది పోయి వైఎస్సార్ సీపీ శ్రేణులపైనా, తనపైనా నిరాధార ఆరోపణలు, తప్పుడు కేసులతో పనిచేస్తున్న విధానం ఏమాత్రం సమర్థనీయం కాదని మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి టీడీపీ నేతలను ఉద్దేశించి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావుకు బహిరంగలేఖ రాశారు. లేఖలో అంశాలను విలేకరులకు వివరిస్తూ ప్రశాంతతకు మారుపేరైన కాకినాడలో రాజకీయ కక్షలు ప్రేరేపించేలా వనమాడి వ్యవహరిస్తున్న తీరు ఆక్షేపణీయమన్నారు. రాజకీయ కక్షతో బియ్యం ఎగుమతుల్లో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్న కాకినాడ రేవుపై కక్షకట్టి చేస్తున్న తప్పుడు చర్యల వల్ల ఆ రేవుపై ఆధారపడ్డ సుమారు 30 వేల మంది కార్మికులు, పోర్టు ఆధారిత వర్గాలు తీవ్రంగా నష్టపోతున్నాయన్నారు. ఇక్కడి రేవులో కావాల్సిన ఎగుమతులు ఇతర రేవులకు తరలిపోవడానికి వనమాడి కారణం కాదా అని ద్వారంపూడి ప్రశ్నించారు. ఓఎన్‌జీసీ చర్యల వల్ల నష్టపోతున్న మత్స్యకారులకు పరిహారాన్ని ఇప్పించేందుకు తమ ప్రభుత్వ హయాంలో తీవ్రంగా ఒత్తిడి తెచ్చి కమిటీ కూడా వేయించామని, నేడు మత్స్యకార వర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కొండబాబు ఈ అంశంపై దృష్టిపెట్టి వారికి న్యాయం చేయాలని, మత్స్యకార భరోసా విడుదల చేయాలని సూచించారు. జగన్నాథపురంపై ప్రతిపాదించిన మూడో వంతెన అలైన్‌మెంట్‌ను తన భూముల మీదుగా వెళ్లేలా మార్చి రూ.30 కోట్లు ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందేందుకు కొండబాబు మళ్లీ ప్రయత్నిస్తున్నారని, ఆయనకు చిత్తశుద్ధి ఉంటే ఇళ్లు కోల్పోకుండా ఏటిమొగ వెనుక ప్రాంతం నుంచి ప్రతిపాదిత బ్రిడ్జి నిర్మాణానికి చొరవ తీసుకోవాలన్నారు. తమ ప్రభుత్వ హయాంలో గంజాయిపై ఉక్కుపాదం మోపి 70 మందిని అరెస్టు చేయించానని, ఇప్పుడు కొండబాబు సైతం అందుకు కృషిచేయాలని, ఇందుకు తామ పార్టీ తరఫున సహకరిస్తామని పేర్కొన్నారు.

ఆరు నెలలు వేచి చూద్దామని...

ఎన్నికలు పూర్తయ్యి కొత్త ప్రభుత్వం వచ్చాక ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ఆరు నెలల సమయం ఇచ్చి ఎలాంటి ఆరోపణలు, విమర్శలు చేయకూడదనుకున్నానని ద్వారంపూడి పేర్కొన్నారు. అయితే ఎమ్మెల్యే వనమాడి నిత్యం అసత్య ఆరోపణలు, తప్పుడు విమర్శలతో చేస్తున్న ఫిర్యాదులు, విమర్శల వల్ల స్పందించాల్సి వస్తోందని అన్నారు. ఉప్పలంక వద్ద ఉన్న ఇసుక నిల్వలు ఎక్కడికి పోయాయని, పీడీఎస్ బియ్యం వ్యవహారంలో మీరు ఎవరిని ప్రోత్సహిస్తున్నారని, ఆయిల్ మాఫియాలో మీ బంధువుల దురాగతాలు ఏమిటని, బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తుల స్థలాన్ని ఎవరు ఎలా కబ్జా చేశారని ఆయన ప్రశ్నించారు. అలాగే అధికారుల బదిలీల్లో ఎంతెంత చేతులు మారాయని, ఇక్కడ సంపాదించిన అవినీతి సొమ్మును హైదరాబాద్ వంటి ఏఏ ప్రాంతాల్లో పెట్టుబడి పెట్టారనే అంశాలపై ప్రజల్లో తీవ్ర చర్చ నడుస్తోందన్నారు. ఆరు నెలలు గడిచిన వెంటనే పై అంశాలతో పాటు ప్రతి సమస్యపైనా స్పందించి ప్రజల తరఫున పోరాడతానన్నారు. ఏమైనా ఆధారాలు ఉంటే బహిరంగపరిచి ఎన్ని కేసులు పెట్టుకున్నా అభ్యంతరం లేదని, చట్టబద్ధంగా వీటిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని ద్వారంపూడి స్పష్టం చేశారు.

వినికిడి మెషీన్ల పంపిణీ



కాకినాడ శుభం కాపు కల్యాణ మండపంలో వినికిడి మెషీన్ల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే నానాజీ, ఎన్ఎఫ్ఎల్ సీఎండీ శర్వానంద్, తోట సర్వారాయుడు తదితరులు

కాకినాడ రూరల్: కాకినాడ, పరిసర గ్రామాలకు చెందిన వారికి వినికిడి మెషీన్లను మంగళవారం శుభం కాపు కల్యాణ మండపంలో పంపిణీ చేశారు. దీన్ దయాళ్ శ్రవణ ఫౌండేషన్, తోట సుబ్బారావు రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో న్యూఢిల్లీకి చెందిన నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (ఎన్ఎఫ్ఎల్) సీఎస్ఆర్ నిధులు రూ.30 లక్షలతో సుమారు 200 మందికి వాటిని అందించారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎల్ సీఎండీ, చైర్మన్ యు.శర్వానంద్, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, తోట సర్వారాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొని మెషీన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి కిరణ్, రంగరాయ మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ మాధవి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ రాజు, రేగుల రామాంజనేయులు, ఉమా మనోవికాస కేంద్రం ఈడీ పెద్దిరెడ్డి, గట్టి సుబ్బారావు, అనపర్తి వెంకటేష్, చక్క రమేష్, కరపర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా మేజర్ డ్రైను పూడిక తీత

డ్రైను పనులను పరిశీలించిన కమిషనర్ తదితరులు

సామర్లకోట: స్థానిక 25వార్డులోని అయోధ్యరామపురం ముంపునకు కారణమైన మేజర్ డ్రైను పనులను మంగళవారం ప్రారంభించారు. కొద్దిపాటి వర్షాలకే బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ నుంచి మఠంసెంటర్ వరకు ఉన్న రోడ్డు చెరువుగా మారుతున్న విషయం తెలిసిందే. స్థానికుల డిమాండ్ మేరకు పూడికతీత పనులను ప్రారంభించారు. ఈ పనులను మున్సిపల్ కమిషనర్ జె.రామారావు పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలో డ్రైన్లలో పూడికతీతకు రూ.36 లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఇందుకు అనుమతి లభించడంతో పనులు ప్రారంభిస్తున్నామని చెప్పారు. పూడిగ తీసిన వెంటనే దానిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఏఈ సాగర్‌ను ఆయన ఆదేశించారు. ఈ పనులకు కౌన్సిలర్ బలుసు వాసు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ చిన్ని, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, రైతు సంఘ నాయకుడు కంటే బాబు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలి

కాకినాడ సిటీ: రాష్ట్రంలో వెంటనే భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలని, నిర్మాణ రంగ కార్మికులను ఆదుకోవాలని కాకినాడ ఏరియా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు తాటిపాక మధు పిలుపునిచ్చారు. మంగళవారం కాకినాడ గ్లాస్ హౌస్ సెంటర్లో లక్ష్మీ గణపతి బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కొత్తగా ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సంఘం ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీకి అనుబంధంగా పని చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు నిధులను జమ చేయాలని డిమాండ్ చేశారు. కాకినాడ జిల్లాలో 2070 క్లెయిములు పెండింగ్‌లో ఉన్నాయని, సుమారు రూ.5.7 కోట్ల నిధులు మంజూరు చేయాలని మధు కోరారు. సమావేశంలో లక్ష్మీగణపతి బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ గ్లాస్ హౌస్ సెంటర్ గౌరవ అధ్యక్షులుగా తాటిపాక మధు, అధ్యక్షుడిగా ఆర్ చిన్నరాజు, ఉపాధ్యక్షుడిగా టి.సాయి, ప్రధాన కార్యదర్శిగా కె.ప్రసాద్, సహాయ కార్యదర్శిగా కాశి, కోశాధికారిగా ఆర్ చక్రితో పాటు మరో ఏడుగురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారని మధు ప్రకటించారు.



బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న తాటిపాక మధు

ఐడియల్ కళాశాలకు బెస్ట్ అప్రిషియేషన్ పురస్కారం



ఉన్నత విద్యామండలి చైర్మన్ రామ్మోహనరావు నుంచి అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ శ్రీకాంత్

బాలాజీచెరువు: ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాలకు జేఎన్‌టీయూకే బెస్ట్ అప్రిషియేషన్ అవార్డు అందజేశారు. జేఎన్‌టీయూ కాకినాడలో మంగళవారం నిర్వహించిన 16వ వ్యవస్థాపక దినోత్సవాల్లో కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీకాంత్‌కు ఉన్నత విద్యామండలి చైర్మన్ రామ్మోహనరావు ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు, కార్యదర్శి పి.చిరంజీవిని కుమారి, డైరెక్టర్ కృష్ణంరాజు, ఏవో జీవీకే వర్మ అభినందనలు తెలిపారు.

గ్రామాల విలీనానికి పోస్టుకార్డు ఉద్యమం

కాకినాడ రూరల్: కాకినాడ కార్పొరేషన్‌లో రూరల్ మండల గ్రామాలు రమణయ్యపేట, వాకలపూడి, వలసపాకల, ఇంద్రపాలెం, చీడిగ, తూరంగిలను విలీనం చేయాలని కోరుతూ పోస్టు కార్డు ఉద్యమం చేపట్టినట్టు పౌర సేవా సంఘం కన్వీనర్, సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు పేర్కొన్నారు. రమణయ్యపేట పంచాయతీలోని రాయుడుపాలెం టీచర్స్‌కాలనీలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. రమణయ్యపేట తదితర గ్రామాలను కార్పొరేషన్ విలీనం చేసి మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు పోస్టు కార్డులు పంపుతున్నట్టు తెలిపారు. టీచర్స్ కాలనీలో డీఎస్ మూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సమావేశంలో పోస్టు కార్డులు పంపే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో అంబటి రామకృష్ణ, కొత్తపల్లి నూకరాజు, ఇబ్రహీం యువరాజు, కసిలంక సూరిబాబు, పెద్దిరెడ్డి సరస్వతి, అప్పారావు, చింతపల్లి అజయ్‌కుమార్, బోగా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



టీచర్స్ కాలనీలో పోస్టు కార్డుల ఉద్యమం చేపట్టిన నాయకులు

జూడాల నిరసనకు విశేష మద్దతు



రిలే నిరాహార దీక్షలు చేస్తున్న జూనియర్ వైద్యులకు సంఘీభావం తెలుపుతున్న న్యాయవాదులు

కాకినాడ క్రైం/కాకినాడ లీగల్: కలకత్తా వైద్య విద్యార్థినిపై అత్యాచార, హత్య ఘటనలతో దేశం అట్టుడుకుతోంది. ఈ నేపథ్యంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, జాతీయ జూనియర్ వైద్య సంఘాల సంయుక్త పిలుపు మేరకు చేపట్టిన నిసరనకు విశేష స్పందన లభిస్తోంది. స్థానిక జీజీహెచ్‌లో చేపడుతున్న జూడాల సమ్మెకు వివిధ సంఘాలు మద్దతు తెలుపుతున్నాయి. ఈ నేపథ్యంలో జేఏసీ జీజీహెచ్ ఎంప్లాయీస్ యూనియన్ నేతలు జూడాల నిరసనకు అండగా నిలిచారు. జేఏసీ చైర్మన్ పాలపర్తి మూర్తిబాబు మాట్లాడుతూ వైద్యురాలిపై అమానుష చర్యను తీవ్రంగా ఖండించారు. హత్యానంతర పరిస్థితులు చూస్తుంటే ఘటనలో పెద్ద తలల ప్రమేయం ఉందనే భావన వ్యక్తమవుతోందన్నారు. ఎటువంటి ఒత్తిళ్లు, ప్రలోభాలకు లొంగకుండా సీబీఐ లోతైన విచారణ చేపట్టాలని కోరారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో వైద్యులు సహా ఆసుపత్రి ఉద్యోగులకు తగిన భద్రత కల్పించేలా కొత్త చట్టాలు తేవడం, ఉన్న చట్టాలు అమలు చేయడంపై దృష్టి సారించాలని ఆయన అన్నారు. కాకినాడ బార్ అసోసియేషన్ మద్దతు తెలపగా అధ్యక్షుడు ముత్తింటి విశ్వేశ్వరరావు బృందం జీజీహెచ్‌లో జూడాలతో కలిసి నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరావు, శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళా వైద్యురాలికి జరిగిన సంఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. మహిళలు, చిన్నారులు, న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక, కఠినమైన చట్టాలను రూపొందించి వాటిని అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. జూడాల నిరసనకు మద్దతు తెలిపిన వారిలో ఏపీఎన్‌జీవో కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, జేఏసీ కన్వీనర్ కట్టిమేను మోహన్‌రావు, ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జి.రవణమ్మ, స్వామిబాబు, శేఖర్, శానిటరీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సీహెచ్ విజయకుమార్ తదితరులు తమ మద్దతు ప్రకటించారు. మధ్యాహ్నం వైద్య విద్యార్థులు జీజీహెచ్ నుంచి ధర్నా చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు.



నిరసనలో జూడాలకు తమ మద్దతు తెలుపుతున్న జీజీహెచ్ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ పాలపర్తి మూర్తిబాబు, బృందం